అనధికార ర్యాంపు.. మనుగడకు ముప్పు

- కరకట్ట పొడవునా వెలుస్తున్న అనధికార ర్యాంపులు
- కొందరి స్వార్థానికి కరకట్ట భవితవ్యం ప్రశ్నార్థకం
- ప్రమాదాలకూ ఆస్కారం



కొల్లూరు ఎస్సీ కాలనీ దాటిన అనంతరం కరకట్ట నుంచి ఇటుక బట్టీలలోకి ఏర్పాటు చేసిన ర్యాంపు మార్గం



కొల్లూరు సమీపంలో అనధికార ర్యాంపు ఏర్పాటుకు తొలిచిన కరకట్ట అంచులు

కొల్లూరు : కృష్ణా నది వరదల తాకిడి నుంచి కంచుకోటలా నిలిచి కావలి కాస్తున్న కరకట్ట మనుగడకు కొందరి స్వార్థం గొడ్డలిపెట్టులా మారింది. వరదల రూపంలో పోటెత్తే కృష్ణమ్మ బారి నుంచి గ్రామాలను కాపాడుతున్న కరకట్ట మనుగడ అనాధికార ర్యాంపుల రూపంలో ప్రశ్నార్థకంగా మారుతుంది. కృష్ణా నది పరీవాహక ప్రాంతం వెంబడి వరదల నుంచి వందలాది గ్రామాలకు రక్షణ కల్పించేందుకు ఏర్పాటు చేసిన కరకట్టల నిర్వహణ విషయంలో గతంలో కట్టుదిట్టమైన నిబంధనలు అమలులో ఉండటమే కాక, ఆచరణలో సైతం అదే తరహాను యంత్రాంగం అమలు చేసి కరకట్టలకు ముప్పు వాటిల్లకుండా రక్షణ కల్పించేవారు. కాలక్రమంలో కరకట్టల మనుగడ విషయంలో ఆర్‌సీ (రివర్ అండ్ కన్జర్వేషన్) శాఖ పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో కరకట్టలు రూపరేఖలను కోల్పోతున్నాయి. వ్యక్తిగత లాభం కోసం కొందరు స్వార్థపరులు కరకట్టల అంచులను తొలిచి, వాటి స్వరూపాన్ని మార్చి అనధికారికంగా ఇష్టానుసారం ర్యాంపులు ఏర్పాటు చేస్తుండటంతో వరదల సమయంలో కరకట్ట తట్టుకొని నిలవడం ప్రశ్నార్థకంగా మారుతుంది.

అక్రమ ర్యాంపులతో ముప్పు

కృష్ణా కుడి కరకట్ట వెంబడి అక్రమంగా ఏర్పాటు చేస్తున్న ర్యాంపుల కారణంగా కరకట్ట భవితవ్యానికి తీవ్ర ముప్పు పొంచి ఉంది. కొల్లూరు ఆర్‌సీ సెక్షన్ పరిధిలో గుంటూరు జిల్లా కొల్లిపర మండలం 29వ కిలో మీటరు నుంచి జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలం కోళ్లపాలెం 58వ కిలోమీటరు వరకు 29 కిలోమీటర్లు పొడవున విస్తరించి ఉంది. నియోజకవర్గంలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో కుడి కరకట్ట వెంబడి ఇటీవల ఇటుక బట్టీల నిర్వాహకులతో పాటు, పంట పొలాలకు నిబంధనలకు విరుద్ధంగా సుమారు 10 నుంచి 15 వరకు అక్రమంగా ర్యాంపులు ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా తయారైంది. కరకట్టలు అంచులు తొలగించి ర్యాంపులు ఏర్పాటు చేయడంతో వరదల సమయంలో కరకట్ట కోతకు గురయ్యే ప్రమాదం ఉంటుందన్న ఆందోళన ప్రజలలో వెల్లడవుతుంది.

ర్యాంపుల ఏర్పాటుకు నిబంధనలు ఇలా...

- కరకట్ట వెంబడి నూతనంగా ర్యాంపులు ఏర్పాటు చేసుకునే పక్షంలో తప్పనిసరిగా ఆర్‌సీ (రివర్ అండ్ కన్జర్వేషన్) అధికారులకు దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలి.
- ఆర్‌సీ అధికారులు తమకు అందిన దరఖాస్తులను పరిశీలించి ర్యాంపులు ఏర్పాటు చేయదలచిన ప్రదేశాన్ని పరిశీలించి అనుకూలమైతేనే అనుమతులు మంజూరు చేస్తారు.
- ఆర్‌సీ యంత్రాంగం అనుమతులు మంజూరు చేసినప్పటికీ ర్యాంపు ఏర్పాటు చేసుకునే వ్యక్తులు వరద నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా ర్యాంపు కింది భాగంలో తూములు ఏర్పాటు చేయాలి.

పొంచి ఉన్న ప్రమాదాలు

- అనధికారికంగా కరకట్టల అంచులను తొలుస్తూ ఏర్పాటు చేస్తున్న ర్యాంపుల కారణంగా కరకట్టకు తీవ్ర అనర్థం వాటిల్లనుంది.
- కృష్ణా నదికి వరదలు సంభవించిన సమయంలో కరకట్ట వెంబడి నీటి ప్రవాహాన్ని ర్యాంపులు అడ్డుకుంటుండటంతో ప్రవాహ వేగం నేరుగా కరకట్టకు తాకి కోతకు గురయ్యే ముప్పు ఉంది.
- ఈ ర్యాంపుల కారణంగా దిగువ నుంచి వాహనాలు కరకట్టపైకి ఎక్కే సమయంలో కరకట్ట పై నుంచి వేగంగా వెళ్లే వాహనాలు ఢీ కొని ప్రమాదాలు చోటు చేసుకొని ప్రాణాలు కోల్పోయే ఆస్కారం ఉంది.

అనధికార ర్యాంపులు చట్ట విరుద్ధం

వరదల నుంచి రక్షణ కల్పించే కరకట్టకు అనధికారికంగా ర్యాంపులు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధం. పంట పొలాలు, ఇటుక బట్టీలకు ఇష్టానుసారం ర్యాంపులు ఏర్పాటు చేయడం వల్ల కరకట్ట భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. అనధికారికంగా ర్యాంపులు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు చేపడతాం.

విజయరాజు, ఆర్‌సీ జేఈ, కొల్లూరు

క్లుప్తంగా

ఆస్తిపన్నుపై రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు

రేపల్లె రూరల్: ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్నుల బకాయిలపై ప్రభుత్వం 50 శాతం వడ్డీ రాయితీని కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను బకాయి మొత్తంను ఏకకాలంలో చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మార్చి 31వ తేదీలోపు పన్నులు చెల్లించి రాయితీలు పొందాలన్నారు. సెలవు దినాలలో సైతం పన్నులు కట్టించుకునేలా వెసులుబాటు కల్పించబడిందన్నారు. మున్సిపల్ కార్యాలయంతో పాటు సచివాలయాలు, ఆన్‌లైన్‌లో సైతం పన్ను బకాయిలు చెల్లించవచ్చన్నారు. చెక్కుల ద్వారా పన్నులు చెల్లించే వారు తప్పనిసరిగా మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించి రశీదులు పొందాలన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డాక్టర్ గణేష్‌ను కలిసిన శివరామకృష్ణ



చెరుకుపల్లి: ఆంధ్రప్రదేశ్ యానాదుల(గిరిజన) సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు బాపట్ల శివరామకృష్ణ మండల కేంద్రమైన చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజనుల సమస్యల సాధనకు నిరంతరం కృషి చేయాలని, తమ మద్దతు ఎప్పుడు అందిస్తామని డాక్టర్ గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా గణేష్‌కు క్యాలెండర్‌ను శివరామకృష్ణ అందజేశారు.

నవజాత శిశువుకు రెడ్‌క్రాస్ సొసైటీ చేయూత

రేపల్లె రూరల్: నవజాత శిశువు ఆపరేషన్‌కు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ ద్వారా చేయూతనిచ్చినట్లు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుళ్ళూరు మండలం రాయపూడి గ్రామానికి చెందిన షేక్ మీరా, అస్మాబేగం దంపతులకు జన్మించిన శిశువు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతుండటంతో విజయవాడ రమేష్ హాస్పిటల్‌ను సంప్రదించారన్నారు. శస్త్ర చికిత్సకు రూ.2 లక్షలు అవసరం కావటంతో దంపతులు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సత్యప్రసాద్‌ను ఆశ్రయించారన్నారు. మంత్రి సత్యప్రసాద్ దంపతుల సమస్యను తమకు వివరించి చేయూత నివ్వాలని ఆదేశించటంతో సంస్థ ద్వారా పలువురు దాతలను సంప్రదించామన్నారు. దీంతో అమెరికాకు చెందిన జాస్తి అనిరుద్, హారిక దంపతులు స్పందించి గుండె శస్త్ర చికిత్సకు అవసరమైన రూ.2 లక్షలను వారి కుమార్తె అన్వ పేరుపై విజయవాడ రమేష్ హాస్పిటల్‌కు అందించారన్నారు. నవజాత శిశువుకు చేయూతనిచ్చిన దాతలకు రెడ్‌క్రాస్ సొసైటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు చీరలు పంపిణీ



కర్లపాలెం: గిరిజన మహిళలకు చేయూతనందించటం వలన ఆత్మసంతృప్తి కలుగుతుందని కరుణా జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు ఇనకొల్లు పోలీస్‌రావు చెప్పారు. మంగళవారం చింతాయపాలెంలో పేరలి రహదారి పక్కన నివాసం ఉంటున్న పది మంది గిరిజన మహిళలకు కరుణా జీవన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంచుకుని అర్హులైన వారందరూ వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మినిస్ట్రీస్ సభ్యులు తుమ్మా కొండలు, వడ్లమూడి సురేంద్రబాబు తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): సీఎం సహాయనిధి పేదలకు వరం వంటిదని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెంలో మంగళవారం ఎమ్మెల్యే నరేంద్రవర్మ లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు అందజేశారు. చందోలు గ్రామానికి చెందిన ముజాహిద్ బేగంకి రూ.3 లక్షలు, భవనంవారిపాలెంకు చెందిన నాగలక్ష్మికి రూ.1.81 లక్షలు, కొత్తపాలెం గ్రామానికి చెందిన సీతామహాలక్ష్మికి రూ.51 వేలు, అల్లూరు గ్రామానికి చెందిన ముసలారెడ్డికి రూ.15 వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రెడిట్ క్యాంపుకు 94 మంది హాజరు



కర్లపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన బీసీ కార్పొరేషన్ రుణాల క్రెడిట్ క్యాంపుకు 94 మంది హాజరయ్యారని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. మొత్తం 39 యూనిట్లు ఉండగా ఆన్‌లైన్‌లో 161 మంది దరఖాస్తు చేశారని క్రెడిట్ క్యాంపుకు మాత్రం 94 మంది హాజరయ్యారని వివరించారు. క్రెడిట్ క్యాంపుకు యూనియన్ బ్యాంక్, గ్రామీణ చైతన్య గోదావరి బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఎస్‌బీఐ ప్రతినిధులు హాజరయ్యారని ఎంపీడీవో తెలిపారు.

లక్ష్మీగణపతి ఆలయంలో వార్షికోత్సవ పూజలు



పాతనందాయపాలెం (కర్లపాలెం): గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయ ప్రథమ వార్షికోత్సవ పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో భాగంగా సూరిబోయిన పోతురాజు, ఇందిర, వెంకటేశ్వర్లు, లక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, శివమ్మ దంపతుల ఆధ్వర్యంలో శాంతి హోమాలు నిర్వహించి అర్చనలు, విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

మత్స్యకార గ్రామాల్లో విద్యాభివృద్ధికి కృషి



ఎస్ టూ నీడీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిన డైరెక్టర్ తోట సురేష్‌బాబు

బాపట్ల: మత్స్యకార గ్రామాల్లో విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని ఎస్ టూ నీడీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ తోట సురేష్‌బాబు పేర్కొన్నారు. ఎస్ టూ నీడీ స్థాపించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా మత్స్యకార గ్రామాల్లోని విద్యార్థులకు మంగళవారం విద్యకు అవసరమైన కిట్లను పంపిణీ చేశారు. ఐదేళ్లుగా విద్యార్థులకు చదువుకు సంబంధించిన పరికరాలు, మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేయటం జరిగిందన్నారు. అదేవిధంగా నందిరాజుతోటలోని గిరిజనులకు నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శివగోగు, బోడిపల్లి గురవయ్యమ్మ, పిక్కి గాయత్రి, యరిపిల్లి సత్యవతి తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించని మద్యం దుకాణాలపై చర్యలు

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: సమయపాలన పాటించని మద్యం దుకాణాలపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ బాపట్ల జిల్లా సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో మంగళవారం మద్యం దుకాణాల లైసెన్స్‌దారులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లైసెన్స్‌దారులు తప్పనిసరిగా తమ దుకాణాల వద్ద నిబంధనలు పాటించాలని, దుకాణాల వద్ద గానీ, చుట్టుపక్కల గానీ వాటర్ పాకెట్లు, గ్లాసులు ఉంచరాదన్నారు. ప్రొహిబిషన్ సిబ్బంది కార్యాలయ పరిధిలో నిర్వహించే ప్రతి పనిని రికార్డులలో నమోదు చేయాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిశీలించాలన్నారు. బైండోవర్ కేసులపై పలు సూచనలు చేశారు. అనంతరం గత నెల మద్యం అమ్మకాలు, మద్యం నిల్వలపై ఆరా తీశారు. సమావేశంలో సీఐ దివాకర్, ఎస్‌ఐ రాజశ్రీ, మద్యం దుకాణాల యజమానులు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాకుండా చూసుకోలేరా?

పారిశుద్ధ్య ఉద్యోగులపై కమిషనర్ ఆగ్రహం



తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయి, అవిరాకుండా పనిచేయలేరా అంటూ మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. 2వ శానిటేషన్ డివిజన్‌లో మంగళవారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే శానిటేషన్ కార్యాలయంలో అటెండెన్స్ పరిశీలించార. అటెండెన్స్‌లో తేడాలు ఉండటాన్ని గమనించిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

28న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలిఅర్బన్: రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన కొత్తపేటలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.కరుణకర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి అదాలత్ ప్రారంభమవుతుందని చెప్పారు. పోస్టల్ సేవల్లో ఎదురయ్యే ఇబ్బందులు, ఇతర ఫిర్యాదులను ఈ నెల 27వ తేదీ లోపు ఉత్తరం ద్వారా డాక్ అదాలత్, పోస్ట్ ఆఫీస్ సూపరిండెంటెండ్, తెనాలి డివిజన్, తెనాలి-522201 అనే చిరునామాకు పంపాలని సూచించారు.

● బాల్యం ఛిద్రం.. వ్యర్థం!



పిల్లలందరితో కలిసి బడిలో ఆటపాటలతో గడపాల్సిన ఇద్దరు చిన్నారుల బాల్యం వ్యర్థాల నడుమ ఇలా ఛిద్రమవుతోంది. కొలకలూరు వంతెన సమీపాన రోడ్డు వెంబడి పంచాయతీ సిబ్బంది చెత్తచెదారం పోస్తుంటారు. సమీపంలోని కాల్వ కట్టపై బలహీన వర్గానికి చెందిన కొన్ని కుటుంబాల వారు పూరి గుడిసెల్లో జీవనం చేస్తుంటారు. వీరి వృత్తి వ్యర్థాలు సేకరించడం, ఇళ్లలో పనిచేయడం. అయితే వీరి పిల్లలు తల్లిదండ్రులతో పాటు రోడ్ల వెంబడి చెత్త చెదారంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తూ అదే బాటలో నడుస్తుంటారు. బడి ఈడు పిల్లలు అందరితో పాటు చదువుకోవాల్సిన వయస్సులో పేదరికం, అవగాహనలేమి వల్ల చెత్త చెదారంలో వ్యర్థాల నడుమ దుర్భర జీవితం గడుపుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం మండుటెండలో ఇద్దరు చిన్నారులు వీపుకు గోనె సంచి తగిలించుకుని ప్లాస్టిక్ బాటిల్స్ ఏరుకోవడం అటుగా వెళ్తున్న ప్రజానీకాన్ని కలచి వేసింది. బడి ఈడు పిల్లల కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నా అవి వీరి దరి చేరడం లేదన్న దానికి ఈ చిత్రమే ఉదాహరణ.

- తెనాలిటౌన్

పంచాంగం ఆవిష్కరించిన మంత్రి మనోహర్



భట్టిప్రోలు: భట్టిప్రోలుకు చెందిన యునెస్కో వాస్తు పండిట్, వాస్తు సామ్రాట్ వంగర చలమయ్య సిద్ధాంతి గారు రూపొందించిన విశ్వావసు నామ సంవత్సర ఓంకార విశ్వశక్తి స్వరూప పంచాంగంను మంగళవారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ శాలివాహన శకం 1947వ సంవత్సరం ఆంగ్లేయుల శకం 2025-26 సంవత్సరం జరుగుచున్నదని తెలిపారు. కార్యక్రమంలో తాడిపర్తి విజయ నాగలక్ష్మి, వంగర నాగ వెంకట దుర్గా సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

రేపల్లె రూరల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పెనుమూడి రోడ్డు తూర్పు జామియా మసీదులో పట్టణ ఆదర్శ వేదిక సభ్యులు మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందును అందించారు. ముస్లిం సోదరులకు పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో 15 సంవత్సరాలుగా ఇఫ్తార్ విందును అందజేస్తున్నట్లు వేదిక సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదర్శ వేదిక అధ్యక్షుడు బి.వి.మోహనరావు, కార్యదర్శి వై.కిషోర్ బాబు, సభ్యులు కె.వెంకటేశ్వరరావు, పి.సాంబశివరావు, కె.ఆనందరావు, కె.నటరాజు, జి.సాంబశివరావు, పి.జవహర్ తదితరులు పాల్గొన్నారు.

వెల్లటూరులో అమ్మవార్ల సన్నిధిలో పారాయణం



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ ఇలవేల్పు ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల సన్నిధిలో అమావాస్య ముందు వచ్చే ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం హరే రామ హరే కృష్ణ నామ పారాయణ 35వ పర్యాయము జరిగింది. ఈ పారాయణ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా పనిచేయాలి

ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి



వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు సూచనలిస్తున్న ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి

నిజాంపట్నం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హుల చెంతకు చేరేలా పనిచేయాలని ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో మంగళవారం ఆమె సమీక్ష నిర్వహించారు. వెనకబడిన తరగతుల వారికి వ్యాపారపరంగా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తోందన్నారు. తమ పరిధిలోని ప్రజలకు సబ్సిడీ రుణాల ఆవశ్యకతను వివరించి అర్హులు దరఖాస్తు చేసుకునేలా చైతన్య పరచాలన్నారు. మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉచిత కుట్టు శిక్షణ తరగతులు, శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్‌లను ఉచితంగా అందిస్తోందన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకుని స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకునేలా చైతన్యపరచాలని తెలిపారు. పలు అంశాలపై సమీక్షించారు. సమావేశంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతికి నివాళి



అమర్తలూరి కృపానందం (ఫైల్)

కొల్లూరు : వృద్ధాప్యం కారణంగా తలెత్తిన అనారోగ్య సమస్యలతో వైద్యశాలలో చికిత్స పొందుతూ కొల్లూరు మండల మాజీ ఎంపీపీ, సీపీఎం నాయకుడు అమర్తలూరి కృపానందం(85) మంగళవారం మృతి చెందారు. గత కొద్ది రోజులుగా గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కృపానందం మండల పరిషత్ వ్యవస్థ ప్రారంభమైన సమయంలో కొల్లూరు మండలానికి తొలి ఎంపీపీగా పనిచేశారు. సీపీఎం పార్టీలో సీనియర్ నాయకులుగా ఉన్న కృపానందం మృతి ఆ పార్టీకి తీరనిలోటని సీపీఎం నాయకులు అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని ఆవులవారిపాలెం శివారు క్రీస్తులంకలోని ఆయన స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి సీపీఎం నాయకులు ఆయన భౌతికకాయంపై ఎర్రజెండాను కప్పి నివాళులర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నివాళులర్పించిన వారిలో నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, టి.కృష్ణమోహన్, బి.అగస్టీన్, టి.సురేష్, పి.నాగమల్లేశ్వరరావు, బి.సుబ్బారావు, సనకా అగ్గిరామయ్య, బీఎల్‌కే ప్రసాద్, బ్రహ్మం, అరుణ, కొల్లూరు మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్‌ప్రసాద్, యూటీఎఫ్ నాయకులు వినోద్‌కుమార్, పరిశుద్ధరావులు ఉన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తెనాలిరూరల్: న్యాయవాది హత్యకు నిరసనగా తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. కోర్టు భవనాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ బార్ అసోసియేషన్ సభ్యుడైన సీనియర్ న్యాయవాది ఇ. ఇశ్రాయేలును పట్టపగలు అత్యంత దారుణంగా దుండగులు హత్య చేశారన్నారు. న్యాయవాదులకే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకు రావాలన్నారు. సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, గుమ్మడి రవి రాజ్ మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు, న్యాయవాదుల హత్యలు పరిపాటిగా మారాయన్నారు. ఇశ్రాయేలు హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి, ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు మద్ది మల్లికార్జునరావు, కామినేని చిన్న, జి. పుణ్యవతి, కనపర్తి బెన్‌హర్, కొమ్ము అబ్రహాం లింకన్, గుంటూరు శ్రీను పాల్గొన్నారు.

మరోసారి వాయిదాపడ్డ వేలం

తెనాలిఅర్బన్: స్థానిక పురపాలక సంఘ పరిధిలోని కూరగాయలు, పండ్లు, చేపలు, మాంసం, చినరావూరు పార్కులోని ఫుడ్ కోర్టు, వాహనాల పార్కింగ్, క్యాంటీన్, ముత్తెంశెట్టిపాలెంలోని కబేళాకు మంగళవారం మున్సిపల్ అధికారులు వేలం పాటలు నిర్వహించారు. గతం కంటే తక్కువగా పలువురు వ్యాపారులు పాడటంతో పలువురు అధికారులు పాటలన్నింటినీ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ మున్సిపల్ నిబంధనల ప్రకారం గతం కంటే ఎక్కువ పాటలు వస్తేనే వాటిని అప్పగించడం జరుగుతుందన్నారు. ఈ నెల 27న మరోసారి వీటికి వేలం పాటలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీఎం లంతిరావు, ఆర్‌వో రాంప్రసాద్, పలువురు రెవెన్యూ ఉద్యోగులు, వ్యాపారులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ గ్రూపునకు యూనిఫాం పంపిణీ



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు సి.జయకుమార్

బాపట్ల: వెదుళ్ళపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ గ్రూపునకు యూనిఫాం పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. చదువుతోపాటు స్కౌట్స్‌లో కూడా రాణించటం ఎంతో సంతోషమని ప్రధానోపాధ్యాయులు సి.జయకుమార్ తెలిపారు. వెదుళ్ళపల్లి పాఠశాలలో క్రీడారంగానికి ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణతో సేవా భావాన్ని కలిగి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నిరంజన్, స్కౌట్స్ మాస్టర్ జి.శివశంకర్, గైడ్ కెప్టెన్ డి.సుప్రియ, సీనియర్ స్కౌట్స్ మాస్టర్ డి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.